నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

ప్రమాదవశాత్తు ఆటోలు దగ్ధం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రమాదవశాత్తు రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని చందు నాయక్ తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పీరీల షెడ్డుతో పాటు పక్కనే నిలిపి ఉన్న రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం విద్యుత్ వైర్లు తగిలి పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానిక విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



ఘనంగా సీతారాముల కళ్యాణం

నవతెలంగాణ-తాంసి

పురాతన చరిత్ర కలిగిన పాలోడి గ్రామ సమీపంలోని రాముల గుట్టపై వెలిసిన సీతారాముల జాతర రెండు రోజులుగా జరుగుతోంది. శనివారం సీతారాముల కళ్యాణాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుండి వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు వీరయ్య సతీష్ వెంకటి కళ్యాణాన్ని నిర్వహించారు. వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్, ఆశన్న, రాములు, సతీష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-భైంసా

ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సహకారంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడతానని ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. శనివారం మండలంలోని కుంబి గ్రామంలో ఉపాధి హామీలో చేపడుతున్న రూ.10లక్షల సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశలవారీగా నిధులు వెచ్చించి గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, అదేవిధంగా పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల నాయకులు పండిత్‌రావు పటేల్, భీమినేని శంకర్, బాలాజీ పటేల్ పాల్గొన్నారు.


నేరాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

ప్రతి నెలలో 4వ శనివారం నిర్వహించే నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పించారు. నేరాలు జరగకుండా ఉండాలంటే ఏం చేయాలనే అంశంపై ఏఎస్ఐ సురేందర్ విద్యార్థులకు వివరించారు. మొదటగా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించడం జరిగింది. పోలీస్‌స్టేషన్ నిర్వహణ గురించి ఏఎస్ఐ విద్యార్థులకు వివరించారు. ఎఫ్ఐఆర్, చార్జ్ షీట్, జీరో ఎఫ్ఐఆర్ గురించి తెలియజేశారు. వివిధ సెక్షన్లు, డయల్ 100 మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జి.వెంకట్‌రావ్, లలిత, వెంకటేశ్వర్, వినోద్‌రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, రాజేందర్, సుమలత, స్వప్న, అంబాజీ పాల్గొన్నారు.

కలప పట్టివేత



నవతెలంగాణ-సిరికొండ

అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి గీరయ్య తెలిపిన వివరాల ప్రకారం..వాయిపేట్ నుండి సిరికొండకు ట్రాక్టర్‌లో అక్రమంగా కలపను తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు గస్తీ నిర్వహించారు. గమనించిన దుండగులు ఓ ఖాళీ స్థలంలో ఆరు కలప దుంగలను పడేసి పారిపోయారు. ట్రాక్టర్‌ను భీంపూర్ గ్రామానికి చెందిన రాముడిగా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా కలపను తరలించినా, ఇసుక రవాణా చేసినా, నిల్వ ఉంచినా అటవీ చట్టరీత్యా నేరమని, కేసులు నమోదు చేస్తామని గీరయ్య హెచ్చరించారు. దాడిలో బీట్ ఆఫీసర్ సందీప్, బేస్ క్యాంపు సభ్యులు మారుతి పాల్గొన్నారు.

జైళ్ల శాఖ డీజీని కలిసిన ప్రముఖ వ్యాపారవేత్త



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జిల్లా జైలు వద్ద ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రను జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొండయ్య చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గతంలో వారికున్న పరిచయంతో యోగక్షేమాలపై కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ యం.సంపత్, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.అశోక్ కుమార్ ఉన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో శనివారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు హన్మండ్లు, పెద్ద లస్మన్న, లస్మన్న, నడిపి చిన్న లస్మన్న, ముత్తన్న, సాయినాథ్, శివరాం, నారాయణ, ఈరన్న, లక్ష్మీకాంత్, నాయకులు సత్యనారాయణ, రాజేశ్వర్, మర్రిబా, సందీప్, సర్వేష్, లచ్చరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

జిల్లా టాస్క్‌పోర్స్ కమిటీ సమన్వయం సమావేశంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

పల్స్ పోలియో కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులు 86290 మంది ఉన్నారని తెలిపారు. పట్టణ పరిధిలో 88, గ్రామీణ ప్రాంతాలలో 543 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి విస్తృత ప్రచారం కలిపించేలా గ్రామాలలో టాం టాం చేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, పట్టణ ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది, మహిళల సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొనాలని అదేశించారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాలలోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 4, 5 తేదీలలో ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. అంతకుముందు ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన సీనియర్ సర్వలెన్స్ మెడికల్ ఆఫీసర్ డా.అతుల్ పల్స్ పోలియో కార్యక్రమ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, డిఆర్ఓ గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ధనరాజ్, డిఆర్‌డిఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

ఖైదీలు నేర ప్రవృత్తికి దూరంగా ఉండేలా కృషి

- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్ర, కలెక్టర్ రాహుల్ రాజ్
- జైలు ఆవరణలో పెట్రోల్ పంప్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖైదీలు నేరప్రవృత్తికి దూరంగా ఉండేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యా మిశ్ర తెలిపారు. శనివారం జిల్లా జైలు శాఖ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం సహకారంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి సౌమ్యా మిశ్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిలాబాద్ జైలులో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇది రాష్ట్ర జైళ్ల శాఖలో ఏర్పాటు చేయబడిన 30వ పెట్రోల్ పంపు అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఖైదీలకు ఉపాధి కల్పించడమే కాకుండా వారు జైలు నుండి విడుదలైన అనంతరం పెట్రోల్ పంప్‌లలో ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. తద్వారా వారు నేరప్రవృత్తికి దూరంగా ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఖైదీలకు జీవనోపాధి కల్పించేందుకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలో నేరాలు మరింత తగ్గి జిల్లా ప్రశాంతంగా మారుతుందని, జిల్లా జైలుకు తమ నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ యన్.మురళీబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జైళ్ల శాఖ నడుపుతున్న పెట్రోల్ పంపులలో నాణ్యమైన పెట్రోల్ ఖచ్చితమైన కొలమానంలో అమ్మబడుతుందని, అందువల్లనే రాష్ట్రంలో ప్రతియేటా బెస్ట్ పెట్రోల్ పంపులుగా ఎన్నికవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ యం.సంపత్, అదనపు ఎస్‌పి.బిపిసియల్ అధికారులు, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.అశోక్‌కుమార్, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెట్రోల్ పంప్‌ను ప్రారంభిస్తున్న డీజీ సౌమ్య, పక్కన కలెక్టర్, జైలు అధికారులు

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-తాంసి

మండలంలోని అన్ని గ్రామాలలో క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రత్యేక ఆరోగ్య చర్యలను చేపట్టడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం హస్నాపూర్ గ్రామంలో క్షయ ముక్తా భారత్ జాతీయ కార్యక్రమంలో భాగంగా గ్రామం ఎన్నికైన సందర్భంగా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన పది గ్రామపంచాయతీలు క్షయ ముక్త గ్రామపంచాయతీలుగా ఎన్నికవ్వడం విశేషమన్నారు. ఎన్నిక విధానంలో తొలుత వెయ్యి మంది జనాభాలో కనీసం 30 మంది టీబి పరీక్షల్లో మొత్తం నెగిటివ్ వచ్చినట్లయితే దాన్ని టీబీ ముక్త గ్రామపంచాయతీలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. వారం రోజులు పొడి దగ్గు జ్వరం లాంటి లక్షణాలు ఉన్నటువంటి వారు తక్షణమే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే పూర్తిగా నయం చేసుకునే వీలుంటుందన్నారు. క్షయ వ్యాధి ఉన్నవారికి ఉచితంగానే మందులు ఇస్తామన్నారు. క్షయ వ్యాధి లక్షణాలున్న వారి వివరాలను గోప్యంగా ఉంచి మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగ్, జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ సాయిప్రియ, వైద్య సిబ్బంది రాథోడ్ తులసీరాం, పంచాయతీ కార్యదర్శి విజయలత, ఆశా కార్యకర్త రేఖ పాల్గొన్నారు.

ఘనంగా హీరాసుక జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని వాన్‌వాట్ గ్రామంలో శనివారం హీరాసుక జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గిరిజనులకు పెద్ద పీట వేశామన్నారు. కచ్‌కంటి గ్రామంలో వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగు రామన్న మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఆలయాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ నిర్మాణాలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ కుమ్ర రాజు, మాజీ ఎంపీపీ సెవ్వ జగదీష్, మాజీ ఎంపీపీ నైతం లక్ష్మి శుక్లాల్, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఊశన్న, బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న, హీరాసుక కులస్తులు పాల్గొన్నారు.



సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పాతఉట్నూర్, ఎక్స్ రోడ్, చాందూరి గ్రామాల్లో హీరాసుక జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా సంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించి, హిరాసుక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడాతూ ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను ఆచారాలను కాపాడుతూనే భావితరాలకు అందించాలన్నారు. పాహండి కుపర్ లింగో, జంగుబాయి, హిరాసుక ఆదివాసీ దేవతలను పూజించాలన్నారు. వారు చూపిన మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలో హిరాసుక భవన అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చాందూరి గ్రామంలో బిటి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులు, గిరిజనేతరులు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్ సంఘం పెద్దలు, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఈ-కేవైసీ క్యాంపు సేవలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-పెంబి

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పంట పెట్టుబడి రూ.6వేలు ప్రతి సంవత్సరం నిరాటంకంగా పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో రైతుల సహాయార్థం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కేవైసీ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో భాగంగా సుమారు 60 మంది రైతులకు సంబంధించిన ఈ-కేవైసీ, ఇతరత్రా సమస్యలను అధికారులు పరిష్కరించారు. క్యాంపుకు స్పందన లభించడంతో సోమవారం కూడా క్యాంపు నిర్వహిస్తామని వ్యవసాయ విస్తరణ అధికారి తెలిపారు. ఈ-కేవైసీ చేసుకోని రైతులు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే క్యాంపుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్ సాయికిరణ్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభం

- రూ.4600 మద్దతు ధర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో సోయాబీన్ కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైంది. నాఫెడ్ తరపున మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు రూ.4600 మద్దతు ధరతో కొనుగోలు చేపట్టారు. ముందుగా తూకం యంత్రాలకు పూజలు జరిపిన అనంతరం తొలి రైతును శాలువాతో సత్కరించారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారి మోహన్‌తో పాటు పలువురు మార్కెటింగ్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ అధికారి మోహన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పంటను తీసుకువచ్చి సంపూర్ణ మద్దతు ధర పొందాలన్నారు. 12 శాతం తేమ ఉన్న సోయాకు పూర్తి మద్దతు ధర దక్కుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ - ఇంద్రవెల్లి

ఈ నెల 26న నిర్వహించే ప్రధాన్ పురోహిత్ సంఘం కుల గురువు హీరాసుక జయంతి వేడుకను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు గెడం భారత్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హీరాసుక జయంతి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరుపుతున్నట్లు తెలిపారు. కుల పెద్దలు, యువకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ విషయమై శనివారం జిల్లా పరిషత్ సీఈఓ రత్నమాలను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన సీఈఓకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అనేక మంది ఉపాధ్యాయులు తమ జీపీఎఫ్ లోన్స్, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌కు సంబంధించిన దరఖాస్తులు పెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయుల ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. సీఈఓ ప్రత్యేక చొరవ తీసుకొని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆడే నూర్‌సింగ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జీపీఎఫ్ సూపరింటెండెంట్ సుధాకర్, ఉపాధ్యాయులు దినేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా నూతన అదనపు ఎస్పీ ఆపరేషన్స్‌గా బి.సురేందర్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ గతంలో అదనపు ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి బదిలీ అయి జిల్లా అదనపు ఎస్పీ ఆపరేషన్‌గా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, కార్యాలయం అధికారి ఏఓ భక్త ప్రహ్లాద్, సిబ్బంది, డీసీఆర్బి, ఎన్ఐబీ, ఫింగర్ ప్రింట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు టి.మురళి, నవీన్, సీసీ గిన్నెల సత్యనారాయణ, సిబ్బంది ప్రభుదాస్, లఖన్ పాల్గొన్నారు.



పది, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 కేంద్రాలలో 13,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. అలాగే మార్చి 18 నుంచి ఏప్రిల్ 02 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 47 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఆయా రూట్లలో అవసరమైన బస్‌లను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు.

మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చూడాలని అన్నారు. అలాగే పరీక్షా సమయం పూర్తయిన తరువాతనే విద్యార్థులను బయటకు పంపాలన్నారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలో అనుమతించరాదని సూచించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పటిష్ఠ బందోబస్తు మధ్యన ప్రశ్న, జవాబు పత్రాలను సంబంధిత కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పరీక్షా సమయాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్ఓ గంగయ్య, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఐఓ పరశురామ్, సంబంధిత శాఖల చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు

ఎమ్మెల్యే లాస్య నందితకు ఘననివాళి



నవతెలంగాణ-ఖానాపూర్

అవుటర్‌రింగ్ రోడ్డుపై కారు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందితకు సంతాపం తెలుపుతూ శనివారం ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణతల్లి చౌరస్తాలో ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో నందిత మృతి చెందడం పార్టీకి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామ్‌నాయక్, రాజ్ గంగన్న, వాల్‌సింగ్, అబ్దుల్ ఖలీల్, శ్రావణ్, బీసీ రాజన్న, గౌరీకర్ రాజు, కొక్కుల ప్రదీప్, కోట మహేష్, కాలేరు దివాకర్, జి.లక్ష్మణ్, ఇర్ఫాన్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమురంభీం భవన్‌లో అధ్యక్షులు ఎర్రాజి హరీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటైనటువంటి మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ తక్షణమే విడుదల చేయాలని, పెంచిన మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఆఫీస్ బెరార్స్, నాగేందర్, కనక దత్తాత్రి, పూజ, నితేష్ పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఎన్‌సీ జనరల్ అనిల్ కుమార్, సీఈటీ శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్ కుమార్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ గోవర్ధన్, డీసీఈ మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు పూర్తి స్థితిగతులను, మరమ్మత్తులు, లీకేజీలు, ప్రాజెక్ట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ జనరల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రాజెక్టు సేఫ్టీకి సంబంధించిన మరమ్మతు పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచుతామన్నారు. ప్రస్తుతం గత వర్షాకాలం డ్యామేజ్‌కు సంబంధించిన కొంత వరకు పనులు నడుస్తున్నాయని అన్నారు. పూర్తి పనులకు సంబంధించి, టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అది పూర్తికాగానే వీలైనంత త్వరగా పనులను చేపడతామన్నారు. వచ్చే వర్షాకాలంలోపు కడెం ప్రాజెక్టు సేఫ్టీకి సంబంధించిన పూర్తి పనులు చేసి సిద్ధంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బోజదాస్, జేఈ రవికుమార్, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

హీరాసుక జయంతికి తరలిరావాలి

- ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకుల పిలుపు



జెండా వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో 26న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న గోండి ధర్మగురు హీరాసుక జయంతికి ఆదివాసీ తొమ్మిది తెగలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలి రావాలని జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్‌లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ సంఘ భవన స్థలంలో హీరాసుక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో వెలసిన సంస్కృతులలో అతి ప్రాచీన సంస్కృతి గోండి, ధర్మమని అన్నారు. ప్రాకృత వ్యవస్థలో మానవులు ఉన్నప్పుడు గోండి ధర్మాన్ని సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను అందించిన గోండి ధర్మ గురువు వ్యవస్థాపకులు హీరాసుకనని పేర్కొన్నారు. పహాంది పారి కుపార్ లింగో, జంగోరాయితాడ గోండి ధర్మ మౌఖిల సాహిత్యం పెర్సాపేన్ ప్రసన్నం చేసే సాహిత్యాన్ని కిక్రి అనే సంగీత సాధనము ద్వారా ప్రసన్నము చేసిన మౌఖిక సాహిత్య ఆది జనకుడు హీరాసుకనని పేర్కొన్నారు. 18 రకాల కృతులు, 16 రకాల వాయిద్యాల పద్ధతులతో సంగీత జ్ఞానం ఇచ్చిన్నటువంటి వారు హీరాసుకనని తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున హీరాసుక జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధనసరి అనసూయ, జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీలతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలోని నాలుగు తెగల పేన్ పట్లాల్, పేన్ కటోడాలు, నలుగురు సగా పర్ధాన్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కొచడే నారాయణ, నాయకులు సెడ్మకి సుభాష్, కుర్సెంగే యాదవ్‌రావ్, గేడం మాధవ్, సిడాం రాంకిషన్, సిడాం పురుషోత్తం, గోడం సునీల్, గేడం జనార్ధన్, దీపక్, ఆర్క శేషరావ్ ఉన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో రైతు వేదికలో శనివారం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై అర్హులకు కళ్యాణలక్ష్మి చెక్కులని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడిగా ఉందన్నారు. అర్హులకి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వశిక్షా అభియాన్ ద్వారా మంజూరైన రూ.8లక్షల నిధులతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం బజార్‌హత్నూర్ నుంచి సొనాల వెళ్లే రహదారి కోల్హారి గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి ఆర్ అండ్ బి నిధులు రూ.3కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఐటీడీఏ నిధుల నుంచి మంజూరైన రూ.22 లక్షల వ్యయంతో కోల్హారి గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీటీసీ తిరుమల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మెన్ పదవి మైనార్టీలకు కేటాయించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ పదవి మైనారిటీలకే కేటాయించాలని ఖానాపూర్ మైనారిటీ సంఘాల నాయకులు కోరారు. శనివారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖానాపూర్‌లోని అన్ని మసీద్ కమిటీలు, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీల ప్రతినిధులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో ఇటీవల పదవులు కోల్పోయిన చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను బల నిరూపణ ద్వారా ఈ నెల 28న ఎన్నిక నిర్వహించాలని, కౌన్సిలర్‌లకు మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారని అన్నారు. గతంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మున్సిపల్ వైస్ చైర్మెన్‌లను ముస్లిం మైనార్టీలకు కేటాయించి జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీల్లో జరిగే అన్ని నిర్ణయాల్లో మైనార్టీల పాత్ర ఉండేలా కేటాయించాలని అన్నారు. ఈనెల 28న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన అవిశ్వాసం అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అదే విధానాన్ని కొనసాగిస్తూ మైనార్టీలకు వైస్ చైర్మెన్ పదవి కేటాయించాలని కోరారు. ఖానాపూర్ మైనార్టీ సంఘాలైన ముస్లిం జేఏసీ, ముస్లిం ఎండీసీ, అన్ని మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ జామ మసీద్ కమిటీ ప్రతినిధి మునావర్ అహ్మద్ ఖాన్, మొహమ్మదీయా మసీద్ కమిటీ అధ్యక్షులు బషీర్ అహ్మద్, మదీన మసీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఫహీం, కరీం కాలనీ మసీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, అర్ఫాత్ కాలనీ మసీద్ ప్రతినిధి షౌకత్ పాషా, ఖదీమ్ మసీద్ కమిటీ అధ్యక్షులు ఆమెర్, మసీద్ కమిటీల ప్రతినిధులు అబ్దుల్ గని, వాసే ఖాన్, సయ్యద్ అయ్యూబ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మజీద్ కమిటీ సభ్యులు


బాధిత రైతులకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అటవీ జంతువుల దాడిలో తమ పశువులను కోల్పోయిన బాధిత రైతులకు మంజూరైన చెక్కులను ఎంపీ సోయం బాపూరావు అటవీశాఖ అధికారులతో కలిసి అందజేశారు. శనివారం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసిన బాధిత రైతులకు బోథ్ మండలంలోని గుట్ట పక్క తండా గ్రామానికి చెందిన గణేష్‌కు రూ.18వేలు, అదే విధంగా ఇదే మండలంలోని చిట్టల్‌బోరి గ్రామానికి చెందిన చౌహాన్ సోమనాథ్ పశువులు సైతం అటవీ జంతువుల దాడిలో మృతి చెందడం వల్ల ఆయనకు రూ.15వేలు చెక్కును ఎంపీ అందజేశారు. అటవీ జంతువుల దాడిలో రైతులు తమ పశువులను కోల్పోయినందున మొత్తం 26 కేసులకు గాను 25 పశువులు మృతి చెందినందుకు రూ.3.62 లక్షల పేర్కొన్నారు. ఈ మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి జి.ప్రమోద్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.పరశురాం, ఫారెస్ట్ రేంజ్ అధికారి బోథ్ కె.వినోద్ కుమార్‌లతో కలిసి బాధిత రైతులకు ఈ చెక్కులు అందజేయగా, మిగిలిన వారికి సైతం త్వరలో చెక్కులను అందజేయనున్నట్లు ఎంపీ తెలియజేశారు.

భీమన్న దేవునికి గంగ స్నానం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

తమ ఆరాధ్య దైవం భీమన్న దేవుని గంగస్నానం పూజను ఆదివాసీలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా పిల్లా పాపలతో వంటా వార్పు చేసుకొని పండుగ జరుపుకున్నారు. ఉత్తరవాహిణిగా ప్రవహించే ఖానాపూర్ గోదావరినదిలో భీమన్న దేవునికి స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలతో పాటు పెంబి, ఇచ్చోడ, కడెం తధితర ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు ప్రతి ఏటా ఇక్కడికి వచ్చి గంగస్నానం చేస్తారు. మరుసటి రోజున గ్రామాల్లో తమ దేవున్ని కొలుస్తూ పండుగ చేసుకుంటారు. వివిధ మొక్కులు మొక్కిన భక్తులు తమ కోర్కెలు నెరవేర్చాలని ఆదేవున్ని వేడుకుంటారు. ప్రతి ఏటా మాఘ మాసంలో భక్తి శ్రద్ధలతో ఈ ప్రాంతానికి స్నానానికి వచ్చి, వంటా వార్పు చేసుకొని వెళ్లడం ఆనవాయితీగా ఉందని వివరించారు.

మద్దతు ధర అడిగితే కాల్పులు జరుపుతారా..?

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్




నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రైతులకు కనీస మద్దతు ధర అడిగినందుకు కార్మిక హక్కులను కాల రాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ హర్యానా పంజాబ్ రైతులు చలో ఢిల్లీ వెళ్తుంటే బీజేపీ ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు లేకుండా రైతులపై కాల్పులు జరపడం వలన శుభ కరణ్ సింగ్(24) ఏండ్ల యువకుడు మరణించాడని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ అన్నారు. రైతులపై నరేంద్ర మోడీ ప్రభుత్వ ధమన ఖండను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమురంభీం భవన్ ఎదుట నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌సింగ్ మాట్లాడుతూ గతంలో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో సంవత్సర కాలంగా ఢిల్లీ కేంద్రంగా అనేక ఉద్యమాలు చేసి రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెనక్కి తిప్పకొట్టగలిగారన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలను తెరమీదకి తీసుకొచ్చి రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా, వ్యవసాయంగాన్ని మొత్తం కార్పొరేట్ చేయడం కోసం, రైతులకు నష్టం చేసే విధంగా చట్టాలను తీసుకొస్తుందని అన్నారు. వాటిని వ్యతిరేకిస్తూ ఢిల్లీ వస్తున్న రైతులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం కాల్పులు జరపడం వలన 160 మందికి పైగా రైతులు గాయపడ్డారని ఒకరు మరణించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం తక్షణమే తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. నూతన అటవీ సంరక్షణ నియమాలను వెనక్కి తీసుకోవాలని, డ్రైవర్లను దెబ్బతీసే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు శుభ కరణ్ సింగ్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రైతుల మీద ప్రయోగిస్తున్న సైన్యాన్ని వెనక్కి పంపాలని అన్నారు. రైతులతో ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, వినోద్, రాజు, నితిన్, సాయి, వెంకట్‌రావు, మోతీరామ్, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ కుటుంబరావు సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు పిప్రి, గిర్నూర్ తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని కల్పించే విధంగా ప్రదేశంలో రెండు సార్లు పారాలు తీసినప్పుడే వారికి కూలీల జమ అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలని సూచించారు. ఎండలు పెరిగిపోవడంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి నర్సరీలో మొక్కలు పెంచాలని అన్నారు. హరితహారానికి మొక్కలు అందుబాటులో ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్యప్రకాష్, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

అధికారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో మేనేజర్‌గా రెండు సంవత్సరాల విధులు నిర్వహించి రామగుండం రీజియన్‌లోని ఆర్ జీవన్ పాలిటీ మేనేజ్మెంట్ మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న డీవైజీఎం సాయి ప్రసాద్, ఆర్కే సెవెన్ గని మేనేజర్‌గా వచ్చిన శ్రీధర్‌ను, అధికారులు ఏఐటీయూసీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఏజెంట్ రాముడుతో కలిసి గని ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య మాట్లాడుతూ సింగరేణి లోనే అతిపెద్ద భూగర్భగని అయిన ఆర్కే-7 లో రెండు సంవత్సరాలు డివైజీయం సాయి ప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్కె-7 గ్రూప్ ఏజెంట్ రాముడు మాట్లాడుతూ ఆర్కే-7 గనిలో డీవైజీఎం సాయిప్రసాద్ ఆర్కె-7 గనినీ శ్రీరాంపూర్ ఏరియాలోనే 100 శాతం ఉత్పత్తి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి పదవులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, ఏరియా సెక్రెటరీ మారేపల్లి సారయ్య, ఫిట్ సెక్రటరీ రవీందర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ ప్రతాప్ పాల్గొన్నారు.

చేతి పంపు ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-రెబ్బెన



గ్రామపంచాయతీ సింగల్‌గూడ గ్రామంలో సేవాలాల్ గుడి వద్ద చేతి పంపు ఏర్పాటు చేసేందుకు శనివారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్తులు, భక్తుల కోరిక మేరకు సింగల్ గూడ గ్రామం సేవాలాల్ గుడి వద్ద బోరింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం రాష్ట్ర పౌరులందరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందాని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్, సీనియర్ నాయకుడు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, మోడెం చిరంజీవి గౌడ్, గోగర్ల రాజేష్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఇంరోజ్, అజ్మేర అశోక్, జమ్మి భాయ్, లావుడ్యా కిషన్, లాల్ సింగ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకానికి ఇంటర్వ్యూలు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటిలోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఇద్దరు ఉద్యోగులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులను ఖైరిగుడ ప్రాజెక్ట్ అధికారి ఎస్ సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి ప్రశ్నించి ధ్రువ పత్రాలను పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుడ ఓసీ మేనేజర్ ప్రవీణ్, వి ఫాటింగ్, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

ముధోల్‌లో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని కాల్వగల్లికి చెందిన హంగిరిగొల్ల రాము(34) తాగుడికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం...రాము అప్పుల బాధతోపాటు తాగుడికి బానిసయ్యాడు. తాగిన మైకంలో శనివారం సాయంత్రం ఇంటినుండి బయటకు వెళ్లి బంధువు చేనులో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-బోథ్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. శనివారం మండలంలోని పాట్నాపూర్‌లో వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ పాట్నాపూర్ శ్రీచైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడా పోటీలు గత 24 సంవత్సరాలు కొనసాగుతున్నాయని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్యేశంతో నిర్వహించడం చాలా గర్వకారణమన్నారు. అలాగే క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటలు ఆడాలని అన్నారు. ఈ పోటీలలో సుమారు 90 జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ, ఎంపీటీసీ జూగాదిరావ్, నాయకులు జీవి రమణ, రాజు యాదవ్, మెస్రం భూమన్న, గోపాల్, ప్రధానోపాధ్యాయులు రాములు, పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు చేతుల మీదుగా రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ఇటీవల మండలంలోని గుట్ట పక్కతండా గ్రామానికి చెందిన చవాన్ గణేష్ రూ.18వేలు, చింతలబొరి గ్రామానికి చెందిన చవాన్ సోమనాథ్ రూ.15వేల చెక్కులను ఎంపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్, ఎఫ్‌బీఓ వినోద్, సిబ్బంది పరశురాం, జాబీర్, పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, వాటి అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, కాంగ్రెస్ ఆదివాసీ విభాగం చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావు అన్నారు. శనివారం మండలంలోని టెక్డిగూడలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం పనులకు గ్రామ పటేల్, మహాజన్, దేవరిలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో తాగునీరు, మురుగు కాల్వల పారిశుధ్యాన్ని సక్రమంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్, దేవరిలు, మాజనులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నక్క రాందాస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదిగ జేఏసీ నూతన కమిటీలో ఆదిలాబాద్ జిల్లా వాసులకు చోటు లభించింది. మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నక్క రాందాస్, అదేవిధంగా జిల్లా అధ్యక్షుడిగా మల్యాల మనోజ్, ఉమ్మడి జిల్లా చైర్మెన్ మోతిబారిక్ రావులను నియమించినట్లు శనివారం మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడుమర్తి రవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మాదిగ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని పేర్కొన్నారు.

తాగు నీరు ఊరిలోకి కాదు..నోటిలోకి రావాలి

- అధికారులు కాలయాపన చేయొద్దు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కౌటాల

మిషన్ భగీరథ నీర్లు ఊరిలోకి రావడం కాదు నోటిలోకి రావాలని, అధికారులు పనిచేయకుండా కాలయాపన చేస్తే ఊరుకోమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కౌటాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే మరో సమావేశానికి పూర్తిస్థాయిలో బాధ్యత గల అధికారులే రావాలి కానీ సమావేశానికి ఒక్కరు రావడం సరైంది కాదన్నారు. వచ్చే సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులను సైతం రప్పించాలని అన్నారు. సొంత లాభం కొంత మానుకో అన్నట్లు ఎస్సీ, ఎస్టీ నిధులను దారి మళ్లించారు. వాటిని సైతం పరిశీలించాలన్నారు. కౌటాల మండలంతో పాటు పలు మండలాలకు వెళ్లే రోడ్లు బాగాలేవని అన్నారు. రైతులు సాగులో రాణించేలా సాగు నీరు అందించేందుకు ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం జరిగేలా ప్రభుత్వంపై తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. అటవీ అధికారులు కారిడార్ పేరిట పోడు రైతులను వ్యవసాయం చేసుకోనివ్వకుండా ప్రతి సంవత్సరం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే పోడు భూమి కలిగిన ప్రతి రైతుకు పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే బర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపడుతానన్నారు. రైతులు పండించిన పంటలు స్థానికంగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కన్నెపెల్లి ఎంపీటీసీ మోతిరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యార్థి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



గుంతలో పడిపోయిన యువకులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

చింతలమానెపెల్లి మండలం బారెగూడ, డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె అజయ్(20) అనే విద్యార్థి కౌటాల నుండి కాగజ్‌నగర్‌కు తమ మిత్రులతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యలో రైల్వేగేటు సమీపంలో అదుపుతప్పి గుంతలో పడిపోవడంతో అజయ్ అక్కడికక్కడే మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపెల్లి మండలం బారెగూడ, డబ్బా గ్రామంలో మృతిచెందిన అజయ్ బాబాయ్ రాజారాం ఇంటిలో గత రెండు సంవత్సరాల నుంచి ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో మృతిచెందిన అజయ్ అక్క మనీష కౌటాల గ్రామంలో ఇంటి నిర్మాణం చేస్తుంది. పని నిమిత్తం అక్కడే ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం తన మిత్రులైన కౌటాలకు చెందిన రాజేష్, బోదంపెల్లి గ్రామానికి చెందిన శ్రీశైలంతో కలిసి కాగజ్‌నగర్‌కు పని నిమిత్తం రాత్రి తొమ్మిది గంటలకు రాజేష్‌కు చెందిన ద్విచక్ర వాహనంపై కౌటాల నుండి కాగజ్‌నగర్‌కు వెళ్తున్న క్రమంలో వేంపల్లి రైల్వేగేటు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుకు కుడిప్రక్కన గల గుంతలో పడిపోవడంతో అజయ్‌కు చాతిపై, తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేష్, శ్రీశైలంకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. మృతుడి బాబాయ్ రాజారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

నవతెలంగాణ-బెజ్జూరు

మంచిర్యాల జిల్లాలోని బోరెపెల్లి గ్రామంలో జ్యోతిబాపులే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ మాలీ సంఘం నాయకులు శనివారం మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా మాలీ సంఘం మండల అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ జ్యోతిబాపులే విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని, వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగంలో కదిలిక రాలేదన్నారు. రోడ్డుపై బైటాయించిన విషయం తెలుసుకున్న ఎస్ఐ విక్రమ్ వారిని సముదాయించి రాస్తారోకోను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు సెండె శంకర్, కావుడె సురేష్, బాపురావు, కావుడె గోపాల్, నికాడి బాపురావు, నికాడి మోమన్, ఆకిరె తిరుపతి, నీలయ్య, రోశయ్య పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న మాలీ సంఘం నాయకులు

గురుకులాల ఆర్సీఓ, ఆర్ఎల్సీలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకులాల ఆర్సిఓ, ఆర్ఎల్సిలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలో ఆర్సిఓ, ఆర్ఎల్సిల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందన్నారు. దీంతో గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం సిబ్బంది ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయిందన్నారు. పర్యవేక్షణ లోపంతో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్లు విద్యార్థులకు పెట్టిందే మెనూ అవుతుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందక నాసిరకమైన భోజనం చేసి అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారని, గతంలో చాలామంది విద్యార్థులు మృతి చెందారని, తాజాగా జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మృతి చెందిందన్నారు. ఆర్సిఓ , ఆర్ఎల్సిలు ఒక్కరోజు కూడా పర్యవేక్షణ చేయకపోవడమే దీనికి కారణం అన్నారు. వీరంతా ఇతర జిల్లాల నుండి పర్యవేక్షణ చేస్తున్నారని ప్రస్తుత సంఘటనకు బాధ్యులను చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల కమిషనర్ లు ఆర్ఎల్సి, ఆర్సిఓ లపై, జిల్లా గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ సిబ్బందిలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నిఖిల్ పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాకు చెందిన బీజేపీ జిల్లా నాయకుడు కోట్నాక విజయ్ కుమార్‌ను రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ నాయకత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గతంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విజయ్ ఎన్నికల సమయంలో టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రధాన పార్టీలకు ప్రత్యర్థిగా దీటుగా ఎదురొడ్డాడు. ఎన్నికల తర్వాత తిరిగి సొంతగూటికి చేరడంతో తాజాగా ఆయనకు ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన అధినాయకత్వానికి కతజ్ఞతలు తెలిపారు. పార్టీలో ఏ పదవి ఇచ్చిన దానికి వన్నె తెచ్చేలా పనిచేస్తానని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఆయుధం లాంటిది



నవతెలంగాణ-సిర్పూర్(టి)

భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన అభివృద్ధి ఆయుధం ఓటు హక్కు అని రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నూతన ఓటరు నమోదు, ఓటు ఆవశ్యకత, ఓటు హక్కు వినియోగంపై కళాజాత ప్రదర్శన ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విశిష్టతపై పాటల ద్వారా ప్రచారం నిర్వహించి రాజ్యాంగం ప్రజలకు కల్పించిన గొప్ప ఆయుధం దేశాభివృద్ధికి సమర్థవంతమైన నాయకత్వాన్ని పెంచుకొని సంక్షేమాన్ని మారుమూల ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు అందించవచ్చున్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుండేలా ఉంచవచ్చని కళాజాత బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధికి హెచ్ఆర్ మేనేజర్ మల్లేష్, ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, ఏపీఓ రామ్మోహన్, ఏపీఎం దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరకు జనసందోహం

- హాజరైన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో నిర్వహించే శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవంతో గంగాపూర్ జాతర శనివారం జనసందోహమైంది. 23వ తేదీ శుక్రవారం స్వామి కళ్యాణంతో ప్రారంభమై 24వ తేదీన రతసప్తమి, 25వ తేదీన స్వామి వారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. మార్గశుద్ధ పౌర్ణమి రోజున తిరుపతిలో ఒక గంట సేపు తలుపలు మూసుకొని గంగాపూర్ గ్రామంలో కొలువై ఉంటాడని భక్తుల నమ్మకం. మన జిల్లా నుండే కాకుండా పక్క జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటుంటారు.

హాజరైన పలువురు ప్రముఖులు

మండలంలోని గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిని శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురంభీం జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, కలెక్టర్ బొర్కాడె హేమంత్ సహదేవరావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీరికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి వెంటకేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

పోలీసుల భారీ బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐలు చిట్టిబాబు, శ్రీనివాస్, సతీష్, ఎస్ఐలు చంద్రశేఖర్, రమేష్, సాగర్ ఆధ్వర్యంలో 13 మంది ఎస్ఐలు, వంద మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. జాతరకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. భక్తులకు వైద్యసేవలు అందించేందుకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రెబ్బెన రైల్వేగేటు నుంచి మూడు దారులుగా విభజించి వాహనాల ద్వారా వెళ్లే భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.

వనదేవతలకు జీఎం పూజలు

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద గల సమ్మక్క సారలమ్మ దేవతల వనప్రవేశానికి ముందు నిర్వహించే పూజా కార్యక్రమాన్ని ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో శ్రీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగులు పరిసర ప్రాంత ప్రజలు మొక్కులను తీర్చుకోవడం చాలా సంతోషకరమైన విషయమని వనదేవతల ఆశీస్సులు మన అందరిపైన ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కె రఘు కుమార్, డీజీఎం(పీ) పి అరవింద రావు, ఆర్కే-7, న్యూటెక్ గ్రూప్ ఏజెంట్ రాముడు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీవో పి కాంతారావు, ఆలయ పూజారి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం

నవతెలంగాణ-ఉట్నూర్

1987సంవత్సరంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన జరిగినప్పటి నుంచి ప్రతి సంవత్సరం శ్రీ స్వామి కళ్యాణోత్సవాన్ని ఫిబ్రవరి 24నాడే ఘనంగా జరుపుకుంటున్నామని విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం అధ్యక్షులు కట్ట ప్రభాకరాచారి అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి 37వ కళ్యాణోత్సవాన్ని పట్టణంలోని పాత ఉట్నూర్‌లో ఘనంగా నిర్వహించామని అన్నారు. మానవుడిగా పుట్టి కాలజ్ఞానం చెప్పి భవిష్యవాణిని వినిపించి, కుల మత కలహాలకు సమాధి కట్టి సంస్కరణ వాదంతో మానవులకు జ్ఞానోదయం కలిగించారని సూచించారు. ఆధ్యాత్మిక చింతనను వీడి మతం, మానవులంతా ఒక్కటేనని కుల మతాలు మానవులు కల్పించినవేనని బోధించి, కలియుగ దేవునిగా కొలువుతీరిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గురువులకు మించిన గురువు మరొకరు లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రంగు మధుకరాచారి, ప్రధాన కార్యదర్శి ముడుపు సాయి కృష్ణచారి, కోశాధికారి నారోజు విజయ్ కుమార్, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-ఉట్నూర్

నర్సింహాస్వామి ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఎంపీపీ పంద్రా జైవంతరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దంతన్‌పల్లి గ్రామంలో నర్సింహాస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం కళ్యాణోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.

మహా పడి పూజా కార్యక్రమం

మూడు రోజుల పాటు నిర్వహించే మహా పడి పూజ కార్యక్రమానికి భక్తులు వచ్చి ఆంజనేయుని దర్శనం చేసుకోవాలని గ్రామ నాయక్ రాథోడ్ భీమ్‌రావ్ నాయక్ అన్నారు. శనివారం పాత ఉట్నూర్, లక్కీశా బంజారా నగర్‌లో నూతనంగా నిర్మాణం చేసిన హనుమాన్ ఆలయంలో 26న ఆంజనేయుని విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందని అన్నారు. నేటి నుంచి పూజ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి పూజ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని కాసిపేట తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలను నిర్వహించారు. ఫస్టీయర్ విద్యార్థులు సెకండీయర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు చేసిన నత్యాలు అలరించాయి. మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు అతిథులు, అధ్యాపకులు విద్యార్థులకు పరీక్షలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఎంపీఓ నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ కూకట్ల రాజేశ్ పాల్గొన్నారు.

కలమడుగులో హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-జన్నారం



మండలం కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి 39వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం మొదటి రోజు హోరాహోరీగా సాగాయి. పది జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ కుమార్. మాజీ ఉప సర్పంచ్ రాజుగౌడ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల మల్లేశ్‌లు పోటీలను ప్రారంభించగా, జట్ల మధ్య పోటీ తీవ్రంగా సాగింది. మొత్తం 27 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10 వేలు నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.5 వేలతో పాటుగా ట్రోపీలను అందజేయనున్నట్లు తెలిపారు.

జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఫలితాల్లో మండల వాసికి 3వ ర్యాంక్

నవతెలంగాణ-హాజీపూర్



గురువారం వెలువడిన జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఫలితాల్లో మండలంలోని పెద్దంపేట్ గ్రామానికి చెందిన బట్టల రాజ్ కుమార్ స్టేట్ ర్యాంక్ సాధించాడు. రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, కాళేశ్వరం జోన్ పరిధిలో మొదటి ర్యాంక్ సాధించి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజ్ కుమార్ చిన్న తనంలోనే తండ్రి నీ కోల్పోయాడు. తన తాత అయిన కోట దుబ్బయ్యగౌడ్ చేరదీసి ఉన్నత చదువులు చదివించాడు. మొదటి నుండి చదువులో చురుగ్గా వుండే రాజ్ కుమార్ గ్రూప్స్ కోసం ప్రయత్నం చేశాడు. చివరగా అదే క్యాడర్‌కు చెందిన జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. గ్రామస్థులు రాజ్ కుమార్‌ను అభినందించారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మురిమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మురిమడుగు గ్రామానికి చెందిన రత్నం గంగరాజు కుమార్తె రత్నం ఐశ్వర్య 21 రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహమైన సంవత్సరానికి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకొని వేరువేరుగా ఉంటున్నారు. విడాకులు తీసుకున్నా కొద్దీ రోజుల తర్వాత మళ్ళీ భార్యాభర్తలు తరుచుగా ఫోన్లో మాట్లాడుకుంటున్నారు. రెండు నెలల క్రితం ఐశ్వర్య భర్త మరణించాడు. అప్పటినుంచి ఐశ్వర్య బాధపడుతూ, దిగాలుగా ఉండేది. శనివారం రోజు ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూమ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బయటికి వెళ్లి వచ్చిన గంగరాజు ఇంట్లో కూతురు కనపడకపోయే సరికి, బాత్రూమ్ గడియ పెట్టి ఉండడంతో బంధువుల సహాయంతో డోర్ తీసి చూడటంతో అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే ఆమెను 108 వాహనంలో జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవేళ్ళగా, అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందిందని తెలిపారు. మృతురాలు ఐశ్వర్య తండ్రి గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

అనుమతులు లేనిది రైస్ మిల్లు పనులు చేయొద్దు

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వపరంగా పూర్తిస్థాయి అనుమతులు పొందకుండా రైస్ మల్ నిర్మాణ పనులు కొనసాగించరాదని మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ హెచ్చరించారు. అనుమతులు లేకుండా అక్రమంగా రైస్ మిల్ నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన సంఘటన స్థలానికి సందర్శించారు. అనంతరం ఖాసీంపల్లిలో రసాయన కర్మాగారం ద్వారా విడుదలవుతున్న వ్యర్థాలతో మూగజీవాలు మతి చెందుతున్నాయని స్థానికుల నుండి అందిన ఫిర్యాదు మేరకు కర్మాగార ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కర్మగారం నుండి వెలువడే రసాయన వ్యర్థాలు బయటకు వెళ్లకుండా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి సుమన్ స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న జెండాలు తొలగించాలి

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీలో గల అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ పార్టీల జెండాలు, తోరణాలు కట్టవద్దని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఐబీలో అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ రంగు పులిముకుంటోందన్నారు. ఏ పార్టీ సభలు, సమావేశాలు జరిగినా ఆయా పార్టీల జెండాలు విగ్రం చుట్టూ కట్టడం పరిపాటిగా మారిందని అన్నారు. ఈ విషయమై పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా అంబేద్కర్ విగ్రహం చుట్టూ పార్టీల జెండాలు కట్టకుండా చర్యలు తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు సిద్దార్థ రామ్మూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, దేవి సత్యం, జూపాక సుధీర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్, లాల్ కుమార్, తోకల రాజేశం, మల్లపెల్లి రాజేశం పాల్గొన్నారు.

ఫ్లైయాష్ వినియోగంలో ఎస్టీపీపీకి అవార్డు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు మరో అవార్డు వరించింది. ప్లాంట్‌కు సంబంధించి నూటికి నూరుపాళ్ళు ఫ్లై యాష్ సద్వినియోగం చేస్తున్న తీరుకు గుర్తింపు లభించింది. ఈ క్రమంలో శనివారం గోవా రాష్ట్రంలో మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ అవార్డును ప్రధానం చేసింది. సౌత్ రీజియన్ పరిధిలోగల 500 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల పరిధిలో ఫ్లై యాష్ వంద శాతం సద్వినియోగం చేసుకుంటున్న తీరును గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణ రావుతో పాటు ఇతర డైరెక్టర్ల పర్యవేక్షణలో పవర్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బసిరెడ్డి, ఓ అండ్ ఎం చీఫ్ జెన్ సింగ్ నేతృత్వంలో లక్ష్యాలను అధిగమిస్తున్నామని ప్లాంట్ అధికారులు అభిప్రాయపడ్డారు.



పదవి ఎవరిని వరించునో..?

- మార్కెట్ కమిటీ చైర్మన్‌కు తీవ్ర పోటీ
- ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్న కాంగ్రెస్ ఎస్సీ నాయకులు



నవతెలంగాణ-జన్నారం

కొలువుదీరిన నూతన కాగ్రెస్ ప్రభుత్వంలో నామెనేటెడ్ పదవులు ఎవరిని వరిస్తుందోనని ఆ పార్టీ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. జన్నారం మార్కెట్ చైర్మన్ పదవి కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గత 15 రోజుల క్రితమే బీఆర్ఎస్ హయంలో కొలవుదీరిన మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో జన్నారం మార్కెట్ చైర్మన్ పదవి గతంలో బీసీ మహిళకు రిజర్వు కాగా ఈ సారి ఎస్సీ జనరల్‌కు ప్రభుత్వం కెటాయించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే మార్కెట్ కమిటీ నియమకం ఉంటుందని ప్రచారం కావటంతో మండలంలోని ఎస్సీ సామాజిక వర్గంకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు. పదవిని ఆశిస్తున్న వారిలో పొనకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దుమ్మల్ల రమేష్, చింతగూడ గ్రామానికి చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దుర్గం లక్ష్మీనారయణ, రేండ్లగూడకు చెందిన దాముక కరుణాకర్, రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పద్మారావు, మామిడిపల్లి ఇందయ్యా, ఇలా ఎస్సీ క్యాటగిరికి చెందిన నాయకులంతా, ఎవరికి వారే మండలానికి చెందిన సీనియర్ నాయకులను వెంట బెట్టుకొని ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ దగ్గరికి వెళ్లి తమ వివరాలను అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న తమకు చైర్మన్ పదవిని కట్టబెట్టాలని ఎమ్మెల్యేను కోరుతున్నారు. వీరిలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఎవరికి స్పష్టమైన హమీ ఇవ్వకుండా అందరి అభిప్రాయలను సేకరిస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఎవరి వైపు ఎమ్మెల్యే మొగ్గు చూపుతారో కొద్ది రోజుల వరకు వేచి చూడవలసిందే.

మహనీయుల విగ్రహాల ధ్వంసం అరికట్టాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బహుజన మహనీయుల విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ దళిత బహుజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం బోరంపల్లి సంఘటనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం మహాత్మ పూలే విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని, గ్రామంలోని బహుజన వర్గాల ప్రజలను నేటికీ పెత్తందారులు బెదిరిస్తున్నారని వారు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు కుట్రలో భాగస్వాములైన ఆధిపత్య వర్గాలను సైతం చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో తొంభై శాతం మెజారిటీగా ఉన్న బహుజన వర్గాల మహనీయులపై దాడులు జరగడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. ఆ మహనీయులు తీసుకొచ్చిన సమానత్వ భావనలను వ్యతిరేకించే వారే విగ్రహాలపై దాడులు చేయడం ద్వారా తమ ఆధిపత్యాన్ని మళ్లీ నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఆధునిక వ్యవస్థలో మనువాదం చెల్లుబాటు కాదని.. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం అందరు నడుచుకోవాలని వారు హెచ్చరించారు. బహుజన వర్గాల ప్రజలు తమ న్యాయమైన హక్కుల కోసం మరింత సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బహుజన మహనీయుల విగ్రహాల రక్షణ, బహుజన సంస్కృతి ప్రచారం చేయడానికి జిల్లాలో బహుజన ఐక్య కార్యచరణ కమిటి ఏర్పడిందని తెలిపారు. బోరంపల్లి గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామ ప్రజలకు సంఘీభావం తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక కన్వీనర్ పలిగిరి కనకరాజు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్కెమోహన్, రైతు సంఘం జిల్లా నాయకులు సంకె రవి, రైతు కూలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్ కుమార్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రామమూర్తి, తెరవే అధ్యక్షులు తోకల రాజేశం, బోరంపల్లి బహుజన ఐక్యవేదిక కన్వీనర్ గోమాస సందీప్, నేతకాని సంఘం జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్య, బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు భవాని, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, న్యాయవాది మెరుగు నరేందర్, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్ కుమార్, గోమాస ప్రకాష్, ఐఎఫ్టీయూ నాయకులు గోపీనాథ్, దారిశెట్టి అరుణ, కాంతయ్య పాల్గొన్నారు.

రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-నస్పూర్



రైతులు చేస్తున్న ఉద్యమాన్ని అనిచివేయడానికి హర్యానా పోలీస్‌లు రైతులపై కాల్పులు జరపడాన్ని వ్యతిరేకిస్తూ శ్రీరాంపూర్‌లో నల్ల బ్యాడ్జీలతో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ ఖనౌరీ వద్ద శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బరు బుల్లెట్‌లతో పోలీసులు కాల్పులు చేయడాన్ని ఆ కాల్పుల్లో 23 ఏళ్ల శుభకరన్ అనే యువకున్ని కాల్చిచంపడాన్ని ఐఎఫ్టీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రైతాంగం రోడ్లెక్కి, దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నారని, ఆ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు. శుభకరన్ మరణం అత్యంత ప్రమాదకరమైన ధోరణి, కాల్పులకు అనుమతి నిచ్చిన పోలీస్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్- బీజేపీ రైతులను దోపిడీ చేయడానికి కార్పోరేట్, ఎం ఎన్‌సీలు, విదేశీ శక్తుల ప్రయోజనాలకు సేవచేస్తున్నారని విమర్శించారు. కార్పోరేట్ అభివృద్ధి లక్ష్యానికి ఎంతగానో ప్రాధాన్యత నిస్తున్నారని, ఇలాంటి దుర్మార్గాలలో భాగమే యువతను, రైతులను చంపుతున్నారని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు భారత రత్న అవార్డును ఇవ్వడమంటే ఆ అవార్డ్ చాటున రైతులను, దేశ ప్రజలను నిట్టనిలువునా దగా చేయడమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ శ్రీరాంపూర్ పట్టణ నాయకులు బి.అప్పారావు, జి. శంకర్, పి.సుధాకర్, రాజేష్, సురేష్, రాంబాబు, రాము, శీను, ఎల్లయ్య, సమ్మయ్య, విజయేందర్, శారద, కవిత, లక్ష్మి, సత్యక్క, సుప్రియ, శిరీష పాల్గొన్నారు.

రసాయన కర్మాగారం ఎత్తివేయాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం గ్రామ పంచాయతీ ఖాసీంపల్లిలో గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన రసాయన ఖర్మాగారం తక్షణమే ఎత్తివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రసాయన కర్మాగారం ద్వార విడుదలైన వ్యర్థాలతో ప్రాణాలను పణంగా పెట్టాల్సివస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారితో పాటు పంచాయతి కార్యదర్శిని కలిసిన స్థానిక ఎంపీటీసీ సభ్యులు అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గం నాయకులు రేగుంట రాకేష్ పిర్యాదు చేశారు. ప్రభుత్వ పరమైన అనుమతులు లేకుండా ఖాసీంపల్లిలో ఏర్పాటు చేసిన రసాయన కర్మాగారం నుండి వెలువడిన వ్యర్థాలు(ద్రవం) తాగిన మేకలు సుమారుగా 30 మృత్యువాతన పడిన తీరును గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న ఖాసీంపల్లి శివారులో గల బ్రాహ్మణ కుంటలో నీరు తాగిన మేకులు ఒక్కొక్కటిగా మృతి చెందడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినప్పటికీ బాధిత కుటుంబాలకు ఎలాంటి లాభం చేకూరలేదని గ్రామస్థులు ఆవేధన త్యక్తం చేశారు. ఈ సంఘటనలో బాధిత కుటుంబాల వారు రూ.3 నుండి రూ. 4 లక్షల ఆస్తిని నష్టపోయారని పేర్కొంటున్నారు. రసాయన కర్మాగారం నుండి వెలువడిన వ్యర్థాలు డ్రైడ్రెన్ ద్వార నేరుగా బ్రాహ్మణ కుంట నీటిలో చేరుతుండటంతో కుంటలో నీళ్ల తాగిన మూగ జీవాలు ఈ విధంగా మృత్యువాతన పడుతున్నాయని వారు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయన కర్మాగారం ద్వార వెలువడుతున్న వాయు కాలష్యంతో స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు.


గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారికి పిర్యాదు చేస్తున్న నాయకులు

వ్యవసాయ అనుబంధ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోలంపల్లి శివారు పంటల సాగుకు అనువైన క్షేత్రమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కళాశాల పొలాస విద్యార్థులు పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనభవ కార్యక్రమం ద్వార గత నెల రోజులుగా మండల పరిధిలో పర్యటిస్తున్న విద్యార్థులు స్థానిక వనరులు, పంటల సాగు విధానంపై అధ్యయనం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం పోలంపల్లి గ్రామ శివారుకు సంబంధించి గ్రామీణ భాగస్వామ్య విశ్లేషాత్మక తులనం, సామాజిక వనరులు, ప్రిఫరెన్స్ ర్యాకింగ్, సమస్యల చెట్టు, కాల క్రమం తదితర విషయాలతో కూడిన అంశాలపై ముగ్గుతో వేసిన చిత్రాల ద్వార స్థానిక ప్రజలకు అవగాహణ కలిపించారు. వరి, పత్తి పంటలు ప్రధానం పంటలుగా సాగు చేస్తున్నప్పటికీ నీటి వనరులు పుష్కలంగా ఉన్నందున వరి పత్తితో పాటు ఇతర పంటలు సాగు చేయడానికి భూములు అనువుగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త శివకృష్ణ, నాగరాజు, విద్యార్థులు అక్బర్ ఖాన్, మనోజ్, విశాల్, ప్రణయ్, ఎండీ ఉబేద్, వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ గౌడ్, శ్రీధర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఓ టు జీఎంగా పనిచేసి పదోన్నతిపై రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా వెళ్తున్న రఘుకుమార్, ఆర్కే సెవెన్ గని మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై రామగుండం-1 ఏరియాకు క్వాలిటీ ఇన్‌చార్జిగా వెళ్తున్న సాయి ప్రసాద్ ను శనివారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా నుంచి పదోన్నతిపై వెళ్తున్న ఇద్దరు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసిన విధంగానే రామగుండం ఏరియాలో ఈ అధికారులు తమ నైపుణ్యాన్ని ఉపయోగించి సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఐకె ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డీజీఎం వర్క్ షాప్ యాదయ్య, క్వాలిటీ ఇన్‌చార్జి కె వెంకటేశ్వర్‌రెడ్డి, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, వత్తి శిక్షణా కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు పాల్గొన్నారు.

26న పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 26న సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని ఆయా పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రముఖ సైకాలిజిస్ట్, సబ్జెక్టు ఎక్స్పర్ట్స్ పదో తరగతి విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. విద్యార్థులు తమ వెంట పరీక్ష ప్యాడ్, పెన్, నోట్ బుక్, వాటర్ బాటిల్ వెంట తీసుకొని రావాలని, ఈ మేరకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బాలికలు ఉంటే తప్పకుండా మహిళా ఉపాధ్యాయురాలు తప్పకుండా ఉండాలని సూచించారు.

మండలంలో డీఆర్డీఓ పర్యటన



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలో డీఆర్డీఓ కిషన్ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయం ఎంపీడీఓ, ఎంపీఓ ఏపీఓ లతో సమావేశమయ్యారు. అనంతరం ఈ జీఎస్ పనులు జరిగే ప్రదేశాలను తనిఖీ చేశారు. రాపల్లి, నర్సింగాపూర్‌లలో పని ప్రదేశాలలో కూలీలతో మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువ వున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలలోపే పనిలో చేరాలని సూచించారు. రోజు కూలీ రూ.272 వచ్చేలా పని చేయాలన్నారు.